క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో కొమ్మాది విద్యుత్ సబ్ స్టేషన్ మారికవలస ఇండస్ట్రియల్ 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కొమ్మాది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దుడ్డు.నరేష్ చెప్పారు. మారికవలస జంక్షన్, మారికవలస గ్రామం, టయోటా షోరూం, బిస్లరీ వాటర్ కంపెనీ, బోరవానిపాలెం, మారికవలస జేఎన్ఎన్‌యూఆర్ రాజీవ్ గృహకల్ప కాలనీ, కొత్త పరదేశిపాలెం, పాత పరదేశిపాలెం, కాపులుప్పాడ డంపింగ్ యార్డు, డ్రైవర్స్ కాలనీ, జేకే లే అవుట్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. వినియోగదారులు, ప్రజలు గమనించి సహకరించాలని నరేష్ కోరారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



పద్మనాభంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రం

పద్మనాభం: పద్మనాభం గ్రామంలో రోటర్ క్లబ్ డైమండ్ వైజాగ్ అధ్వర్యంలో కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభమైంది. ఈ కేంద్రాన్ని క్లబ్ అధ్యక్షుడు శశి జైస్వాల్ ప్రాంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆర్.నీరజ, సంయుక్త కార్యదర్శి ఆర్.కాళీ ప్రసాద్, కోశాధికారి ఎస్.కామేశ్వరరావు, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ప్రతినిధి కె.రమాప్రభ, ఐద్వా ప్రతినిధి నాగరాణి, రాము, నరిసింగరావు పాల్గొన్నారు.

పశుబీమా సద్వినియోగం చేసుకోవాలి

మధురవాడ: పశు పోషకులు పాడి ఆవులు, గేదెలు, ఇతర పశువులకు బీమా చేయించుకోవాలని మధురవాడ పశువైద్య కేంద్రం వైద్యాధికారిని అనుపమ సూచించారు. ప్రీమియం మొత్తంలో 80 శాతం ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. పాడి ఆవులు ఒకసారి ఈనినవి, 2 నుంచి 10 సంవత్సరాల వయస్సులో ఉన్న వాటికి వర్తిస్తుందని చెప్పారు. మరిన్ని వివరాలకు సంప్రదించాలని ఆమె కోరారు. పశు యజమానులు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులు సన్మార్గంలో పయనించాలి



మాట్లాడుతున్న సీతారామ దొర

తగరపువలస: విద్యార్థులు ఎల్లప్పుడూ సన్మార్గంలో పయనించాలని చిట్టివలసకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రంగూరి సీతారామదొర సూచించారు. చిట్టివలస శ్రీలక్ష్మి శ్రీనివాస కల్యాణ మండపంలో ఆదివారం ఒక ప్రైవేట్ విద్యాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వీడ్కోలు వేడుకలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో అలరించారు.

‘ఆసరా’తో అతివలకు ఆర్థిక భరోసా



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



స్వయం సహాయక సంఘాల సభ్యులకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆసరా పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులకు చేసిన రుణ మాఫీతో వారంతా ఆర్థిక స్వావలంబన సాధించారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం నాలుగో విడత ఆసరా పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఐదేళ్లలో సున్నా వడ్డీ బకాయిలు చెల్లించలేదన్నారు. రుణ మాఫీ చేయలేదని ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పద్మనాభం మండలంలో నాలుగు విడతలుగా 1186 స్వయం సహాయక సంఘాలకు చెందిన 12,575 మంది సభ్యులకు రూ.45 కోట్ల రుణ మాఫీ చేశారన్నారు. రాష్ట్రం ఆర్థిక పరిస్థితులు బాగోలేకపోయినప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి క్రమం తప్పకుండా రుణ మాఫీ అమలు చేశారన్నారు. మగ పిల్లలతోపాటు ఆడ పిల్లలను కూడా చదివించాలని సూచించారు. పద్మనాభం మండలంలో ప్రజలకు రూ.350 కోట్లు లబ్ధి చేకూర్చామని చెప్పారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు నాలుగో విడత ఆసరా కింద రూ.10,99,66,113 మెగా చెక్కు అందజేశారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, భీమునిపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచలి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ ఈర్ల ఈశ్వరరావు పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కో ఆర్డినేటర్ సత్యంనాయుడు, ఏపీఎం ప్రభాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు సిరుగుడి ఆదినారాయణ, మామిడి శివరామకృష్ణ, చందక శ్రీను, ఈర్ల ఈశ్వరరావు, మొకర అప్పలనాయుడు, బొలె అప్పలనాయుడు, తాలాడ పద్మనాభం, బుగత సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆసరా సొమ్ముతో వ్యాపారం



ఎనిమిదేళ్ల కిందట భర్త మృతిచెందిన తాను శ్రీ వినాయక స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిని. ఆసరా పథకం కింద ఒక్కొక్క విడతలో రూ.10వేల చొప్పున నాలుగు విడతల్లో రూ.40 వేలు రుణ మాఫీ సీఎం జగన్ చేశారు. ఆ డబ్బులతో దుస్తుల వ్యాపారం చేస్తున్నాను. ఇంటి వద్దే చీరలు అమ్ముతుంటాను. ఆ డబ్బులతో జీవనం సాగిస్తున్నా.

– ఆర్.రామలక్ష్మి, రెడ్డిపల్లి

పాడి పశువుల ఆదాయంతో...



తాను మయూర స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిని. తనకు ఆసరా కింద విడతకు రూ.6 వేలు చొప్పున నాలుగు విడతలుగా రూ.24వేలు వచ్చింది. ఆ సొమ్ముతో రెండు ఆవులు కొన్నాను. ఆ ఆవులు ఇచ్చిన పాల ద్వారా నెలకు రూ.6 వేలు ఆదాయం వస్తోంది. ఆ డబ్బులతో జీవనం సాగిస్తున్నాం.

– జి.లక్ష్మి, పొట్నూరు

కాలువ కబ్జాకు యత్నం



స్వతంత్రనగర్ - బొట్టవానిపాలెం రోడ్డులో కాలువను కప్పేందుకు చేపట్టిన నిర్మాణ పనులు

మధురవాడ: ఓ వ్యక్తి ఏకంగా ప్రభుత్వ కాలువనే ఆక్రమించి, దానిపై సిమెంట్ పలకలు వేసి తన భూమికి దారి చూపించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటుంటే జీవీఎంసీ అధికారులు మాత్రం నిద్ర నటిస్తున్నారు. పలుకుబడి, ఆర్థిక, అంగబలం ఉన్న వ్యక్తి కావడంతో ప్రలోబాలకు గురై ఎవ్వరూ నోరు మెదపడం లేదన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 5వ వార్డు స్వతంత్రనగర్ – బొట్టవానిపాలెం రోడ్డులో ఉన్న భారీ కాల్వ వెనుక కొన్ని ప్రైవేటు వ్యక్తుల స్థలాలు ఉన్నాయి. వాటికి రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ప్రభుత్వ కాల్వనే ఆక్రమించి కొద్ది రోజులుగా సిమెంట్ పలకలు వేసేస్తున్నారు. అస్సలు కాలువ నిర్మాణ సమయంలోనే సదరు వ్యక్తులకు అనుకూలంగా జీవీఎంసీ అధికారులు పనులు చేశారన్న విమర్శలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా జీవీఎంసీ అధికారులు మాత్రం ముడుపుల మత్తులో జూగుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై ఏసీపీ శాస్త్రిని వివరణ కోరగా పరిశీలించి చర్యలు చేపడతామని తెలిపారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



అమనాంలో ప్రచారం నిర్వహిస్తున్న విజయరాంపురం కమిటీ ప్రతినిధులు

తగరపువలస: పద్మనాభం మండలం విజయరాంపురం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు ఆదివారం భీమిలి మండలం అమనాం పంచాయతీలోని అమనాం, జీరుపేట, గొల్లలపేటలో ఇంటింటా భగవద్గీతపై ప్రచారం చేపట్టారు. ప్రబోధానందుడు రచించిన ఆధ్యాత్మికతపై అవగాహనలో భాగంగా దేవాలయాల రహస్యాలు, హిందూ సాంప్రదాయాలు, పండగల గురించి వివరించారు. వేమన పద్యాల సారాంశాలను తెలియజేశారు. ప్రచార కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కనకల త్రినాథరావు, జి.కృష్ణ, సూరప్పడు, వి.సురేష్, కె.లక్ష్మి, కె.రాజు, కె.కళావతి పాల్గొన్నారు.

ముగిసిన తాజుద్దీన్‌బాబా జయంతి ఉత్సవాలు



బాబా ఆశ్రమంలో ప్రత్యేక ప్రార్థనలో మహిళలు



చందల్, చాదర్‌కు స్వాగతం పలుకుతున్న రెడ్డి బాబా

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి పంచాయతీ నీలయమ్మసత్రం కూడలిలో గల తాజుద్దీన్ బాబా ఆశ్రమంలో మూడు రోజులపాటు జరిగిన 163వ జయంతి వేడుకలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు భక్తులు ఆస్థానంలో చాదర్, చందనం, పుష్పమాలలు తదితర పూజా సామగ్రి సమర్పించారు. వేడుకల్లో భాగంగా నెల్లిమర్ల ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, గీతం విద్యాసంస్థల చైర్మన్ ఎం.భరత్, టీడీపీ నెల్లిమర్ల ఇన్‌చార్జి కర్రోతు బంగారురాజు తదితరులు ఆశ్రమ వ్యవస్థాపకుడు ఎ.రెడ్డిబాబా ఆశీర్వాదాలు తీసుకున్నారు. మూడు రోజులపాటు జరిగిన అన్నదానాన్ని ట్రస్ట్ ప్రతినిధి డి.రాజు కుముందన్ తదితరులు పర్యవేక్షించారు.

క్రికెట్ నెట్ ప్రాక్టీస్ బాక్సు ఏర్పాటు



శిల్పారామంలో క్రికెట్ నెట్ ప్రాక్టీస్ బాక్సు

పీఎం పాలెం : శిల్పారామంలో ఔత్సాహిక క్రికెట్ క్రీడాకారులు తమ నైపుణ్యం మరింత మెరుగు పరచుకోడానికి అవసరమైన క్రికెట్ నెట్ ప్రాక్టీస్ బాక్సు అందుబాటులోకి వచ్చింది. వికెట్లకు ఎదురుగా ఇన్ స్వింగ్, ఔట్ స్వింగ్, స్పిన్, పేస్ (స్పీడ్ అప్ టూ 140 కీమీ) బంతులు వేయడానికి వీలుగా మెషిన్‌ను అమర్చారు. మూడు ఓవర్లు (18 బంతులు)కు బ్యాట్స్‌మెన్ రూ.100లు చెల్లించాల్సి ఉంటుందని స్థానిక పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డి తెలిపారు.

ఆసరా చెక్కుల పంపిణీ నేడు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలసలో సోమవారం ఉదయం 10 గంటలకు డ్వాక్రా మహిళా సంఘాలకు వైఎస్సార్ ఆసరా చెక్కులను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పంపిణీ చేయనున్నారు. అలాగే మధ్యాహ్నం 2.30 గంటలకు నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ముగింపు భీమిలి వుడా మినీ స్టేడియంలో జరుగుతుంది. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీవో జానకి కోరారు.

ఘనంగా శ్రీబాసర విద్యార్థుల ఫెస్ట్



శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ రమేష్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

తగరపువలస: స్థానిక శ్రీబాసర జూనియర్ కళాశాల విద్యార్థుల వీడ్కోలు ఫెస్ట్ పెద్దిపాలెం చెన్నా ఫంక్షన్ హాలులో ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన దర్శకుడు శివ నిర్వాణ మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలు, కళారంగాలపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ పూడి రమేష్‌తో కలిపి నగదు బహుమతులు అందించారు. అనంతరం రమేష్‌ను ఘనంగా సత్కరించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు వి.వి.డి.రమేష్, మహేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే సీఎం జగన్ లక్ష్యం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



వేములవలసలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : రాష్ట్రంలో పేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెద్దిపాలెంలో రూ.25 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను, రూ.106.70 లక్షలతో నిర్మించనున్న జల జీవన్ మిషన్ పథకానికి శంకుస్థాపన, వేములవలసలో రూ.20 లక్షలతో నిర్మించిన రోడ్లు, కాలువలను, లొడగలవానిపాలెంలో రూ.20 లక్షలతో నిర్మించిన కాలువలు, రోడ్లను, రూ.29.10 లక్షల జల జీవన్ మిషన్ నిధులతో నిర్మించిన మంచినీటి పథకానికి ప్రారంభోత్సవం, రూ.45.80 లక్షల జల జీవన్ మిషన్ నిధులతో నిర్మించనున్న మంచినీటి పథకానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యాన్ని అందించడంతోపాటు, సురక్షిత మంచి నీటిని శివారు గ్రామాలకు సైతం అందించడానికి చర్యలు తీసుకున్న ఏకైక ప్రభుత్వం మనదేనన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డినే మరలా ముఖ్యమంత్రిని చేసుకుంటేనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో మరలా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే గెలిపించడానికి కృషి చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో అడపా లవరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీలు పాండ్రింకి శ్రీను, బొట్టా ధనలక్ష్మి, సహకార సంఘం అధ్యక్షుడు పాండ్రింకి అప్పారావు, గ్రంథాయల సంస్థ మాజీ చైర్మన్ బంటుబిల్లి మణి శంకరనాయుడు, సర్పంచ్‌లు బావిశెట్టి భారతమ్మ, లెంక పైడమ్మ, కోన పైడిరాజు, లొడగల రాజేశ్వరి, ఎంపీటీసీ సభ్యులు రౌతు శ్యామల, కోరాడ రాంబాబు, నాయకులు బీఆర్‌బీ నాయుడు, కోన శ్రీను, కోరాడ అప్పలస్వామి నాయుడు, రౌతు వెంకటరావు, పిన్నింటి వెంకటరమణ, బంక సూర్యనారాయణ, గుండు నానాజీ, కోరాడ ముసిలినాయుడు, లొడగల రమణ, ఉప్పాడ సూరిబాబు, ఇల్లిపిల్లి నరిసింగరావు, పడాల రాము, కూరాకుల మురళి, రౌతు శ్రీను, ఉప్పాడ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెద్దిపాలెంలో వెల్‌నెస్ సెంటర్ ప్రారంభోత్సవ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

వైఎస్సార్ చేయూత మహిళ మార్టు ప్రారంభం



పద్మనాభంలో వైఎస్సార్ చేయూత మహిళా మార్టు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

పద్మనాభం: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో స్వయం సహాయక సంఘాల సభ్యుల సొంత నిధులు రూ.60 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ చేయూత మహిళా మార్టును ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మార్టులోని వస్తువులు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, భీమునిపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచలి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, భీమునిపట్నం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఓజీఎస్ వ్యవస్థాపకుడికి సేవా పురస్కారం



శివను సత్కరిస్తున్న తాసుబెల్లి ఫౌండేషన్ ప్రతినిధులు

ఆనందపురం : మండలంలోని గంభీరంలో ఉన్న ఓజీఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దలాయి శివ సేవలను గుర్తించి తాసుబెల్లి ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు ఆదివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో సత్కరించారు. కరోనా సమయంలో రోగులకు వివిధ రకాల సేవలు అందించడంతోపాటు అత్యవసర సమయంలో ఉచితంగా రక్తాన్ని సరఫరా చేసి ఆదుకున్నారు. నిరాశ్రయులకు ఆహారం, దుస్తులు అందించి వారికి సహాయపడుతున్నారు. ఈ మేరకు తాసుబెల్లి ఫౌండేషన్ సంస్థ చైర్మన్ శంకర్ నాయుడు తమ ఫౌండేషన్ తరపున దలాయి శివను సత్కరించి భారత సేవారత్న అవార్డు బహూకరించారు. కార్యక్రమంలో వివిధ సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొండబాబు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టు సచివాలయం పరిధి గోవుపేటలో రూ.4 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించనున్న రోడ్డు పనులకు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు ఆదివారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. మౌలిక సౌకర్యాల కల్పనలో రాజీ పడకుండా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మేరుగు చిన్నారావు, పుక్కళ్ల సుందరరావు, అప్పలరాజు, వాసుపల్లి గురువులు, సూరాడ లక్ష్మణరావు, వాసుపల్లి నల్లయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వేటూరి గీతాలతో సంగీత విభావరి రేపు

సీతంపేట: సినీ గేయ రచయిత వేటూరి సుందర రామ్మూర్తి 88వ జయంతి సందర్భంగా ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ మంగళవారం సాయంత్రం 6 గంటలకు డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో వేటూరి రచించిన చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు కళా పీఠం కార్యదర్శి గంటి మురళి తెలిపారు. ఈ సందర్భంగా సినీ నేపథ్య గాయని గాలిదేవర సాహితిని వేటూరి యువ గాయని పురస్కారంతో సత్కరిస్తున్నట్లు చెప్పారు. సినీ గాయని సాహితి, రమేష్ పట్నాయక్, శంబర జోగారావు, బాల గణేష్, హారిక, పట్నాయక్, లిపికారెడ్డి తదితరులు వేటూరి గీతాలను ఆలపిస్తారన్నారు. జయప్రదం చేయాలని కోరారు.

ఎన్ఎంఎంఎస్ ఉచిత శిక్షణకు ఆహ్వానం

తగరపువలస: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ 2024 పరీక్షకు ఈ నెల 30న ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఉచిత శిక్షణ ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ శిక్షణ తరగతులను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఆయన 2021 – 2022 నుంచి 2023 – 2024 వరకు ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన 50 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశం కానున్నారు. కార్యక్రమంలో వివిధ విద్యాశాఖల అధికారులు పాల్గొంటారు. అనంతరం వారిని సత్కరించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గంటాన మోహనరావు తెలిపారు. వివరాలకు 93819 87074, 94932 01857లో సంప్రదించాలని కోరారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా విర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకుడు రఘునాథ్ , పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు రాజీవ్‌లోచన్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

• శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై వేంచేయజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆనందపురం ఉన్నత పాఠశాలలో 2000 - 2001 విద్యా సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆనందపురం : ఆనందపురం ఉన్నత పాఠశాలలో 2000 – 2001 విద్యా సంవత్సరంలో చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అదే ఉన్నత పాఠశాలలో ఉత్సాహంగా నిర్వహించారు. అప్పుడు చదువుకున్న సుమారు 70 మంది విద్యార్థులు తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించారు. అందరూ కలిసి మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు. తాము చదువుకున్న పాఠశాలకు 20 సీలింగ్ ఫ్యాన్‌లను బహూకరించారు.